క్లుప్తంగా

నమ్మించి మోసం చేసిన కూటమి ప్రభుత్వం

రంపచోడవరం: కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకంలో ఇచ్చిన హామీ అమలులో మోసం చేసిందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబురావు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇవ్వాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా రూ.13 వేలు తల్లులు అకౌంట్‌లో వేసి మోసం చేసిందన్నారు. రూ.2వేలు పాఠశాల నిర్వహణకు మళ్లించడం సరికాదన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరంపై ప్రచారం



ముంచంగిపుట్టు సంతలో ఆటోలో మైక్‌తో ప్రచారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: ఈ నెల 23న లబ్బూరు పీహెచ్‌సీలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించడంపై శనివారం మండల కేంద్రంలో వారపు సంతలో ఆటోలో మైక్ ద్వారా వైద్య సిబ్బంది ప్రచారం నిర్వహించారు. కంటి సమస్యతో బాధపడేవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మండల ఆప్తామాలిక్ అసిస్టెంట్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్య నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రత్యేక వైద్య నిపుణులతో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరుగుతుందని,ఈ అవకాశాన్ని నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరాఉ. నేత్ర వైద్య శిబిరంకు వచ్చే వారంతా ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు, ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని అన్నారు.కంటి ఆపరేషన్ అవసరమైన వారికి విజయనగరం తరలించడం జరుగుతుందని, ఉచితంగా రవాణ, వసతి, భోజనం కల్పించనున్నట్టు చెప్పారు.

సప్పర్ల సంతకు అడ్డాకులు



సప్పర్ల సంతకు వచ్చిన అడ్డాకులు

గూడెంకొత్తవీధి: అటవీ ఫలసాయాల సేకరణకు దాదాపుగా స్వస్తి పలుకుతోన్న గిరిజనులు తాజాగా అడ్డాకులను సేకరించి సప్పర్ల సంతకు తీసుకువచ్చారు. అడవులు తగ్గిపోవడం వాటికి తోడు ఆకుల తగ్గాయి. మరోవైపు గిరిజనులకు అనేక రకాల ఉపాధి అవకాశాలు రావడంతో కొన్ని రకాల అటవీ ఫలసాయాల సేకరణకు మానుకున్నారు. ఇప్పుడు సప్పర్ల సంతకు తీసుకువచ్చారు. వాటిని మైదాన ప్రాంతాలకు చెందిన వారు వచ్చి కొనుగోలు చేశారు. వారు విస్తర్లుగా తయారు చేసి విక్రయిస్తారు.

అందుబాటులో వరి విత్తనాలు



వరి విత్తనాల కిట్లు

రాజవొమ్మంగి: స్థానిక రైతు సేవా కేంద్రానికి శుక్రవారం వరి విత్తనాలు వచ్చాయి. ఇప్పటి వరకు ఈ కేంద్రానికి 1017 కిట్లు (205 క్వింటాళ్లు) వరి విత్తనాలు వచ్చినట్టు మండల వ్యవసాయ అధికారి చక్రధర్ తెలిపారు. ఒక్కో కిట్‌లో 30 కిలోల వరి విత్తనాలు ఉంటాయన్నారు. వీటిని గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీ ధరకు త్వరలో అందజేస్తామన్నారు. ఇప్పటి వరకు వచ్చిన విత్తనాల్లో ఎంటీయూ 1064–అమర, ఎంటీయూ 1121 శ్రీధృతి, బీపీటీ–5204 సాంబ మసూరి, ఆర్‌జీఎల్–2537, నెల్లూరి సన్నాలు తదితర రకాలు ఉన్నట్టు తెలిపారు. విత్తనాల మొలక శాతం పరిశీలించిన తరువాత పంపిణీ జరుగుతుందన్నారు. ఎకరాకు 20 కిలోల విత్తనాలు సరిపోతాయని ఏఓ సూచించారు. జడ్డంగి, కొమరాపురం, లబ్బర్తి రైతు సేవా కేంద్రాల్లో కూడా వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు.

అష్టాదశ శక్తి పీఠంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని న్యూకాలనీలో అష్టాదశ శక్తి పీఠం ఆలయ 10వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం ఆరు గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది.

దారుణ దారులు

- శిథిలావస్థకు చేరిన శిరగాం రహదారి
- కుంగిన కాజ్‌వే
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



శిరగాం రహదారి దుస్థితి

అరకులోయటౌన్: కూటమి ప్రభుత్వం ఉగాది నాటి కల్లా రోడ్ల నిర్మాణం, గుంతలు పూడ్చి వేస్తామని చెప్పినప్పటికీ నేటికి అనేక ప్రాంతాల్లో గుంతలు పూడ్చిన దాఖలాలు లేవు. ప్రధానంగా గిరిజన ప్రాంతంలో రహదారులు మెరుగుపడకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రహదారులు అధ్వానంగా ఉండడంతో రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు తప్పడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతాల్లో కోట్లాది రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించారు. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏజెన్సీలోని శివారు గ్రామాల్లోనూ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. చాలా ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో పనులన్నీ నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో కనీస పనులు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఏజెన్సీలో ఒక్క అభివృద్ధి జరగలేదు.

అమలుకు నోచుకోని హామీలు

ఎన్నికల సమయంలో ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం, తాగునీటి కల్పన, తదితర అభివృద్ధి పనులు చేపడతామని హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజన గ్రామాల వైపు తొంగి చూడడం లేదని గిరిజనులు వాపోతున్నారు. చినుకు పడితే చిత్తడిగా మారే రహదారులపై ప్రయాణం సాగించాల్సి వస్తోంది. పెద్ద పెద్ద గోతులతో రహదారులు దర్శనమిస్తున్నాయి. మండలంలోని చొంపి జంక్షన్ నుంచి చొంపి పంచాయతీ కొత్తవలస, పప్పుడు వలస మీదుగా మారుమూల శిరగాం పంచాయతీ కోడిపుంజువలస, శిరగాం గ్రామం వరకు రహదారి పూర్తిగా శిథిలమైంది. రాళ్లు తేలి గోతులతో దర్శనమిస్తోంది. ఇదే రహదారి మీదుగా శిరగాం పంచాయతీ లంతంపాడు, దిబ్బవలస ప్రాంత పీవీటీజీలు ప్రతీరోజు ఆటోలు, బైక్‌లతో రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం పడితే గోతుల్లో నీరు చేరడంతో గమనించలేని వాహనచోదకులు జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రహదారుల సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



శిరగాంలో కుంగిన కాజ్‌వే

రహదారి బాగు చేయాలి



మండలంలోని చొంపి జంక్షన్ నుంచి శిరగాం గ్రామం వరకు రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గత దశాబ్దాల క్రితం నిర్మించిన బీటీ రోడ్డు ప్రస్తుతం పాదచారులకు నడిచి వెళ్లలేని విధంగా మారింది. మండల కేంద్రానికి వెళ్లాలన్నా, స్వగ్రామాలకు రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. రహదారి బాగు చేయాలి.

– **బురిడి పాపారావు**, లంతంపాడు గ్రామం, అరకులోయ మండలం

ప్రతిపాదనలు పంపాం



చొంపి జంక్షన్ నుంచి శిరగాం రహదారి శిథిలావస్థకు చేరిందని, మరమ్మతు చేసేందుకు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, నిధులు విడుదల చేస్తే రహదారి బాగు చేస్తాం.

– రాముమ్, డీఈఈ, పీఆర్ ఇంజినీరింగ్ శాఖ, అరకులోయ

హౌసింగ్ బకాయిలు విడుదల చేయాలి



డుంబ్రిగుడలో ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నాయకులు, గ్రామస్తులు



మంచంగిపుట్టులో ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు

ముంచంగిపుట్టు: పీఎం జన్‌మన్ పథకం ద్వారా గృహాలు నిర్మించుకున్న పీవీటీజీ లబ్ధిదారులకు హౌసింగ్ బకాయిలు రూ.21 కోట్లు వెంటనే కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎం .శ్రీను, కె.నర్సయ్యలు డిమాండ్ చేశారు. హౌసింగ్ బకాయిలపై గిరిజన సంఘం నేతలు శనివారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం జన్‌మన్ పథకం ద్వారా జిల్లాలో అత్యంత వెనుకబడిన పీవీటీజీ తెగల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి పక్కా గృహాలు మంజూరు చేసిందని, పీవీటీజీ అంతా గృహాలు నిర్మించుంటే బిల్లులు మంజూరు చేయకపోవడం, రూ.21కోట్ల మేర నిధులు విడుదల చేయాల్సి ఉందన్నారు. ఉన్న ఇళ్లను కూల్చేసి అప్పులు చేసి ఇంటి పనులు చేయడం జరిగిందని,నిధులు మాత్రం విడుదల కాకపోవడంతో పీవీటీసీ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బకాయి నిధులు విడుదల చేయాలని ఈ నెల 27న పాడేరు ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు చెప్పారు. పీవీటీజీ గృహ లబ్ధిదారులంతా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు నారాయణ, గాసిరాందొర, ఈశ్వరి, విజయ, జీనా తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: పీఎం జన్‌మన్ గృహాల బిల్లు బకాయిలు తక్షణమే చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన సాగర పంచాయతీ బలియగుడ పీవీటీజీ గిరిజన గ్రామంలో పర్యటించి గిరిజనులతో మట్లాడారు. అనంతరం ఆయన గృహ లబ్ధిదారులతో కలిసి బిల్లులు చెల్లించాలని ఆందోళన చేపట్టారు. సూర్యనారాయణ మాట్లాడుతూ పీఎం జన్‌మన్ గృహాల బిల్లుల బకాయిలు చెల్లించాలని బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతండడంతో ఈనెల 27న పాడేరు ఐటీడీఏ వద్ద చేపట్టే ధర్నాను విజయవతం చేయాలని పిలుపునిచ్చారు. హౌసింగ్ అధికారులు ముడుపులిస్తే గాని గృహ బిల్లులు మంజూరు చేయడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారని తెలిపారు. వాటిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బి సింగన్న, పి శ్రీను, విజయ్‌కుమార్, సుమంత్, డేవిడ్, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణలో కూటమి ప్రభుత్వం విఫలం

చింతూరు: దేశంలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేసినప్పుడే వారికి రక్షణ కలుగుతుందని ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ అన్నారు. చింతూరు మండలం తుమ్మలలో జరిగిన ఐద్వా 4వ మండల మహాసభలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మహిళలపై అనేక దాడులు జరుగుతున్నాయని, కూటమి ప్రభుత్వం మహిళలకు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. మహిళలకు ఆడబిడ్డ నిధి కింద రూ 1,500 ఇస్తానని చెప్పి ప్రభుత్వం మర్చిపోయిందని, తల్లికి వందనం రూ 15,000 ఇస్తానని మాటమార్చి రూ.13,000 మాత్రమే ఇవ్వడం మహిళలను మోసం చేయడమేనని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో భాగంగా 15 మందితో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా ఎం.శ్రీదేవి, కార్యదర్శిగా బి.రాములమ్మ ఎన్నికయ్యారు. సీఐటీయూ, గిరిజన సంఘం నాయకులు వెంకట్, సురేష్, శ్రీనివాసరావు, సుబ్బమ్మ, కమల, ఎంపీటీసీ సభ్యురాలు ముర్రం లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ

'చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్టు దారుణం'

వీఆర్ పురం: కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకత్వాన్ని టార్గెట్ చేసి అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని, దీన్ని బీసీ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఆవుల మరియదాసు చెప్పారు. మండల కేంద్రంలోని పార్టీ కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు ఇంటి వద్ద శుక్రవారం పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మరియదాసు మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగుతోందన్నారు. అన్యాయం అక్రమాలు తప్ప ప్రజల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రాజకీయాల పట్ల నిజాయితీ నిబద్ధత గల నాయకుడని అటువంటి వ్యక్తిని జైలుకు పంపడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో బుద్ధి చెబుతారన్నారు. పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాచర్ల గాంగులు, ఆర్టీఐ విభాగ జిల్లా అధ్యక్షుడు బోడ్డు సత్యనారాయణ, ఎస్టీ సెల్ జిల్లా కమిటీ సభ్యులు చిక్కాల బాలు, మోడెం నరేష్, ముత్యాల గౌతమ్, ఉప సర్పంచ్ ముంజపు రాము, నాయకులు ముత్యాల శ్రీధర్, ముత్యాల సాయి, బొర్రా శ్రీనివాసు, రేవు బాలరాజు, రెడ్డిమల్ల శ్రీనివాసు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మరియదాసు

పాముకాటుతో మహిళకు అస్వస్థత

హుకుంపేట: పాముకాటుతో ఓ మహిళ అస్వస్థతకు గురైంది. మండలంలోని తీగలవలస పంచాయతీ మారుమూల కిన్నెర్లోవా గ్రామానికి చెందిన కిల్లో పద్మ అనే మహిళ శనివారం వ్యవసాయ పనుల నిమిత్తం గ్రామ సమీపంలోని పొలం వద్దకు వెళ్లింది. ఆ సమయంలో చోడి పంట గాబు తీస్తుండగా అంతలో పాము కాటేసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి అలంకరణ

కొయ్యూరు: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని జ్యేష్ఠ మాసం చివరి శనివారం పురస్కరించుకొని వజ్ర కవచాలంకృతులతో పాటు పలు రకాల పూలమాలలు, తులసీమాలలతో అందంగా అలంకరించారు. స్వామివారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించుకున్నారు. ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

'యువత పోరు'ను విజయవంతం చేయండి

జి.మాడుగుల: ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు భృతి తక్షణమే చెల్లించాలని వైఎస్సార్‌సీపీ యూత్ జిల్లా అధ్యక్షుడు గబ్బాడి శేఖర్, సొలభం సర్పంచ్ ఐసరం హనుమంతరావు, మండల పార్టీ అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండం నాయుడు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాదైనా హామీని అమలుచేయకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 23న పాడేరులో వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపుమేరకు 'యువత పోరు' పేరుతో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో యువత పోరు కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలను ఇచ్చి అధికారంలోనికి వచ్చి సంవత్సర కాలం పూర్తయినా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. నిరుద్యోగ యువతకు ప్రతీ నెల భృతి ఇస్తామని నమ్మబలికి ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో చేపట్టే యువత పోరు కార్యక్రమాన్ని నిరుద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, యువత విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు చినమత్స్యకొండబాబు, ఉత్తర వేణుబాబు, బాలు తదితరలు పాల్గొన్నారు.



జి.మాడుగులలో యువత పోరు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ సభలు

గంగవరం : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ గ్రామసభలు మండలంలో ముగిసినట్టు సోషల్ ఆడిట్ రిసోర్స్ పర్సన్ పున్నమి నాయుడు తెలిపారు. ఆముదాలబంద గ్రామంలో ఉపాధి హామీ సామజిక తనిఖీ గ్రామ సభ నిర్ణయ్ యాప్ ద్వారా గ్రామసర్పంచ్ రాజులమ్మ అధ్యక్షతన నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 381 పనులకు ఆరు కోట్లకు పైగా ఖర్చు చేసిన సామాజిక తనిఖీ చేసినట్టు చెప్పారు. ఈ సమావేశానికి పాడేరు నుండి అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ సురేష్ కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గంగవరం , అడ్డతీగల రెండు మండలాల్లో ప్రస్తుతం ఆడిట్ జరిగినట్టు చెప్పారు. 23న గంగవరంలోను, 24న అడ్డతీగల మండలాల్లో మండల ప్రజా వేదికలు జరుగుతాయి సురేష్ కుమార్ వెల్లడించారు. ఈ మండల ప్రజా వేదికలు సభలకు ప్రీసైడింగ్ అధికారిగా డ్వామా పీడీ డాక్టర్ విద్యాసాగర్ హాజరు అవుతారని అన్నారు. ఆముదాలబంద గ్రామసభలో ఎంపీటీసీ ఆదినారాయణ దొర, ఉపాధి ఏపీఓ ప్రకాశ్, ఎంఈఓ మల్లేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆముదాలబంద గ్రామసభలో పాల్గొన్న ఉపాధి హామీ అధికారులు

ఘనంగా పార్వతీదేవీ, సాంబమూర్తుల కల్యాణం



నాగులాపల్లిలో పార్వతీ దేవీ-సాంబమూర్తుల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో శనివారం రాత్రి పార్వతీ దేవి, సాంబమూర్తుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. సాంబశివుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం ఏర్పాటుచేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు.

జాతీయ రహదారిపై పశువుల తిష్ట

- వాహనచోదకుల అవస్థలు
- చోద్యం చూస్తున్న అధికారులు

కొయ్యూరు: జాతీయ రహదారిపై పశువులు తిష్టవేస్తున్నాయి. రైతులు వాటిని వదిలివేయడంతో అవి స్వేచ్ఛగా రోడ్లపై పడుకుంటున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పశువులను తప్పించే క్రమంలో ప్రమాదాల బారిన పడిన వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభమైనా యజమానులు తమ పశువులను షెడ్లలో ఉంచకుండా వదిలేస్తున్నారని పలువురు చెబుతున్నారు. దీంతో పశువులు రోడ్లపై తిష్టవేస్తున్నాయని, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రహదారులపై పశువుల సంచారాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



చింతూరులో యోగాసనాలు వేస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్ తదితరులు

రంపచోడవరం/చింతూరు: ప్రతిరోజూ యోగాసాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు కట్టా సింహాచలం, అపూర్వభరత్‌లు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన యోగా కార్యక్రమాల్లో వారు వేర్వురుగా పాల్గొని యోగాసనాలు వేశారు. రంపచోడవరం మండలం వాడపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి పాల్గొని యోగసనాలు వేశారు. అరకులోయ, పాడేరు నియోజకవర్గ కేంద్రాలతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో యోగా దినోత్సవాన్ని జరిపారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో యోగాసనాలు వేస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం తదితరులు



వాడపల్లిలో యోగాసనాలు వేస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి తదితరులు

ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవం

అనకాపల్లి: ప్రపంచంలో దేశ సంగీత కళాకారులు ఎంతో ఖ్యాతిని గడించి, మహానుభావులుగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిన్నరాజుపేటలో ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరజీవి ఘంటసాల చిత్రపటానికి శనివారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్యాగయ్య, అన్నమయ్య, పురందరదాసు, క్షేత్రయ్య, రామదాసు భక్తి కీర్తనలతో భగవంతునికి అంకితమయ్యారని పేర్కొన్నారు. తెలుగు వారైన బాలమురళీ కృష్ణ, ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, సుశీల, జానకి, లీల, పి.బి.శ్రీనివాస్ వంటి వారు తెలుగు సినీ రంగంలో తమ గానం ద్వారా తెలుగు జాతి, తెలుగు భాష కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు నందేల అప్పారావు, ఐ.వి.రమణ మూర్తి, ఎల్.వి.ఎ.రామారావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి నూతన సొబగులు

కొయ్యూరు: మండలంలోని నరసింగబిల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి నూతన సొబగులు అద్దుతున్నారు. దాతలు సమకూర్చిన రూ.6 లక్షల విరాళంతో ఆలయంపై విష్ణుమూర్తి దశావతారాల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. 2012లో ఏర్పాటు చేసిన ఆలయాన్ని దఫదఫాలుగా దాతలు, భక్తుల సహకారంతో అభివృద్ధి చేస్తున్నారు. ఇటీవల అందంగా ఆలయానికి, గోపురాలకు రంగులు వేయించారు. ఆలయ పేరుతో బోర్డును ఏర్పాటు చేశారు. తాజాగా దశావతార విగ్రహాలను శిల్పులు తయారు చేసి అమర్చి తీర్చిదిద్దుతున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మజ్జి ఫణీష్, కోన నాగ వెంకట సురేష్ పనులను పర్యవేక్షిస్తున్నారు.



ఆలయానికి వేసిన రంగులు